క్లుప్తంగా

రాయికోడ్ తహసీల్దార్‌గా ఆశాజ్యోతి



రాయికోడ్(అందోల్): రాయికోడ్ తహసీల్దార్‌గా ఆశాజ్యోతి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహించిన శ్రీనివాస్ ఇటీవల బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా నూతన తహసీల్దార్ ఆశాజ్యోతి మహబత్‌పూర్, మాదాపూర్ గ్రామాల రెవెన్యూ సదస్సుల్లో పాల్గొని భూ సమస్యలపై దరఖాస్తులు స్వీకరించారు.

వ్యర్థాలు చెత్త సేకరణ వాహనాల్లోనే వేయండి



వ్యర్థాలు వేసేందుకు ముస్లింలకు సంచులు అందజేస్తున్న కమిషనర్

నారాయణఖేడ్: బక్రీద్‌ను పురస్కరించుకొని ముస్లిం సోదరులు వ్యర్థాలను మున్సిపల్ చెత్త సేకరణ వాహనాల్లోనే వేయాలని కమిషనర్ జగ్జీవన్ సూచించారు. మున్సిపల్ కార్యాలయంలో వ్యర్థాలను వేయడానికి ముస్లింలకు శుక్రవారం సంచులను పంపిణీ చేశారు. చెత్త సేకరణకు వార్డుల వారీగా ప్రత్యేకంగా మున్సిపల్ స్వచ్ఛ వాహనాలను నడుపుతున్నామని, వ్యర్థాలను వాటిలోనే వేయాలని సూచించారు.

భూ భారతితో భూ సమస్యలు పరిష్కారం

నారాయణఖేడ్: రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలను పరిష్కరించడం కోసమే భూ భారతి సదస్సులను నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ హసీనాబేగం పేర్కొన్నారు. శుక్రవారం నారాయణఖేడ్ మండలం గంగాపూర్‌లో నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడుతూ రైతులు ఏవైనా సమస్యలుంటే భూ భారతిలో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రెవెన్యు సిబ్బంది జైపాల్, మల్లేష్ కుమార్, దినకర్, అపర్ణరెడ్డి, పండరీ, శంకర్ ఉన్నారు.

జన్నుబాయి, బసవరాజులకు ఆర్టీసీ ఎండీ సన్మానం

సంగారెడ్డి టౌన్ : విధి నిర్వహణలో నిజాయితీతో పనిచేసిన సంగారెడ్డి ఆర్టీసీ డిపోలో పని చేస్తోన్న జన్నుబాయి, బసవరాజులను సంస్థ ఎండీ సజ్జనార్ శుక్రవారం హైదరాబాద్ బస్‌భవన్‌లో ఘనంగా సన్మానించారు. ఈ నెల 4న పిట్లంకు చెందిన ప్రయాణికుడు సిద్దులు జేబీఎస్‌కు వెళ్లే బస్సులో తన బ్యాగును మరిచిపోయి సంగారెడ్డి కొత్త బస్టాండ్‌లో దిగి వెళ్లిపోయాడు. ఆ బ్యాగులో రూ.2.50లక్షలు, లాప్‌టాప్, ఒక ప్రాజెక్టర్ ఉంది. అదే బస్సులో విధులు నిర్వర్తిస్తున్న జన్నుబాయి, బసవరాజులు ఈ బ్యాగును గుర్తించి వెంటనే సిద్దులుకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. ఆయన వచ్చి బ్యాగును తీసుకుని సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. వీరి నిజాయితీని గుర్తించిన సంస్థ ఎండీ సజ్జనార్ వీరిద్దరినీ ఘనంగా సన్మానించారు.

రక్తదానం ప్రాణదానం



రక్తదానం చేస్తున్న యువకులు

నారాయణఖేడ్: ఆపరేషన్ సిందూర్‌లో అసువులు బాసిన అమర జవాన్ల స్మారకార్థం ఖేడ్ శ్రీరామ్‌సేన ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రాంతీయ ఆస్పత్రిలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ శ్రీనివాస్‌రెడ్డి శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం 60మంది యువకులు రక్త దానం చేసి దేశభక్తిని చాటుకున్నారు. శ్రీరామ్‌సేన బాధ్యులు రజినీకాంత్, సాయిరాం, ప్రశాంత్ ఉన్నారు.

వైభవంగా ప్రతిష్ఠాపన ఉత్సవాలు

నారాయణఖేడ్: పట్టణ శివారులోని మనూరు క్రాస్ రోడ్డు వద్ద లలితాంబిక దేవి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. లలితాంబిక సహిత శివ, గణపతి, సుబ్రహ్మణ్య, శ్రీచక్ర, నాగదేవత, నంది, ధ్వజ, స్తంభం, శిఖర, ప్రతిష్ఠాపన ఉత్సవాలను శాస్త్రోక్తంగా పురోహితులు గురుజ్యోషి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉత్సవాల్లో ఎమ్మెల్యే సంజీవరెడ్డి సతీమణి అనుపమారెడ్డి, అంతర్‌గాం పీఠాధిపతి కరణ్ గజేంద్ర భారతి పాల్గొన్నారు.

అధికారికి సన్మానం

సంగారెడ్డి జోన్: కలెక్టరేట్‌లోసహాయ సంచాలకులుగా విధులు నిర్వహిస్తున్న వెంకట రమణ ఉపసంచాలకులుగా పదోన్నతి పొంది హైదరాబాద్‌కు బదిలీ అయ్యారు. శుక్రవారం కలెక్టరేట్‌లో గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డా.వైద్యనాథ్, సంతోష్ కుమార్‌తో పాటు సభ్యులు వెంకట రమణను పూలమాల, శాలువాతో సన్మానించారు.

నెరవేరని లక్ష్యం

కంపోస్టు షెడ్లు నిరుపయోగం
- లక్షలు వెచ్చించి నిర్మాణం
- అయినా రోడ్లపైనే చెత్తాచెదారం
- నిర్వహణ గాలికొదిలేసిన యంత్రాంగం



తాటిపల్లిలో నిరుపయోగంగా ఉన్న వర్మికంపోస్టు షెడ్డు

మునిపల్లి(అందోల్): గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణను మెరుగు పర్చడంతోపాటు పంచాయతీకి అదనపు ఆదాయం సమకూర్చాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ప్రతి గ్రామంలో కంపోస్టు షెడ్లను నిర్మించింది. అయితే వాటి నిర్వహణ గాలికి వదిలేయడంతో రూ.లక్షలు వెచ్చించి గ్రామాల్లో ఏర్పాటు చేసిన డంపింగు యార్డులు నిరుపయోగంగా మారాయి.

మందుబాబులకు అడ్డా

నిర్వహణ కరువవ్వడంతో ఆశించిన లక్ష్యం నేరవేరక కంపోస్టు షెడ్లు మందుబాబులకు అడ్డగా మారాయి. ఆరేళ్ల క్రితం కేంద్ర ప్రభుత్వం ప్రతి గ్రామ పంచాయతీకి రెండు లక్షల రూపాయలతో వర్మి కంపోస్టు షెడ్లను జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా నిర్మించింది. నిర్మాణం చేపట్టిన నాటి నుంచి నేటి వరకు వర్మింపోస్టు షెడ్లలో తడి, పొడిచెత్తను వేరుచేసి వర్మి కంపోస్టును తయారు చేయలేదు. కంపోస్టు షెడ్ల ముందే గ్రామంలో సేకరించిన చెత్తను డంపుచేసి కాలుస్తున్నారు. ఎరువుల తయారీకి ఏర్పాటు చేసిన షెడ్లలో కంపోస్టు చేయలేకపోతున్నారు. తగిన సిబ్బంది లేరని, ఉన్న పనులు చేయడానికి సమయం సరిపోవడం లేదని కొత్తగా



కంకోల్ నుంచి సింగీతం వెళ్లే రోడ్డు ప్రక్కన దర్శనమిస్తున్న చెత్తాచెదారం.

వాటిని ఎక్కడ పెట్టుకోవాలని కొందరు పంచాయతీ కార్యదర్శులు వాపోతున్నారు.

కానరాని పర్యవేక్షణ

షెడ్ల నిర్వహణ విషయంలో మండల, జిల్లా స్థాయి అధికారులు సైతం శ్రద్ధ చూపించకపోవడం శోచనీయం, కనీసం రెండు నెలల కొక్కసారైనా వాటి నిర్వహణపై అధికారుల పర్యవేక్షణ లేదని ఆరోపణలున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కంపోస్టు షెడ్ల నిర్వహణపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

వినియోగంలోకి తేవాలి



కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన వర్మి కంపోస్టు షెడ్లను అధికారులు వినియోగంలోకి తేవాలి. వర్మి కంపోస్టు ఎరువుల తయారీపై రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలి. కంపోస్టు ఎరువు వ్యవసాయ భూములకు ఎంతో ఉపయోగంగా ఉంటుంది.

– ప్రశాంత్, రైతు, ఎటిగడ్డ సంగ్యం

త్వరలోనే వినియోగంలోకి తీసుకువస్తాం



జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా ప్రతి గ్రామంలో ఆరేళ్ల క్రితం రూ.2 లక్షలతో వర్మి కంపోస్టు షెడ్లను నిర్మించారు. స్థానిక అవసరాలను బట్టి కంపోస్టును తయారు చేస్తున్నారు. అన్ని గ్రామ పంచాయతీల్లోను వర్మి కంపోస్టు షెడ్లను వినియోగంలోకి తేవాలని ఆదేశాలు జారీ చేశాం. త్వరలోనే అన్నింటినీ వినియోగంలోకి తెస్తాం.

– సాయిబాబా(డీపీఓ)

ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీ

జోగిపేట(అందోల్): మున్సిపాలిటీ పరిదిలోని 20వ వార్డులో శుక్రవారం కాలనీకి చెందిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మున్సిపల్ కమిషనర్ తిరుపతి మంజూరు పత్రాలను అందజేశారు. 100 రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా తడిచెత్తతో ఎరువులు ఎలా తయారు చేసుకోవాలో అవగాహన కల్పించారు. ప్రతి ఇంట్లో ఎరువులు తయారు చేసుకోవడం వల్ల మహిళలు ఆర్థికంగా ఎదుగుతారని, పట్టణం చెత్త రహితంగా తీర్చిదిద్దగలమని చెప్పారు. ఇందిరమ్మ ఇల్ల లబ్దిదారులు నిర్మాణాలు పూర్తిచేయాలని కోరారు. కార్యక్రమములో ఈఈ శ్రీకాంత్, ఆర్ఓ శ్రీధర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వినయ్, ఆర్‌ఐ నారాయణ తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు పత్రాలు అందజేస్తున్న తిరుపతి

పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు

వట్‌పల్లి(అందోల్): అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు వస్తాయని యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం అందోల్ మండల పరిధిలోని కన్‌సాన్‌పల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం పనిచేస్తుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రతి గ్రామానికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ శ్రీనివాస్, కార్యాదర్శి నాగరాజు, ఏయంసీ మాజీ డైరెక్టర్ శేరి వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ బాలయ్య, నాయకులు కృష్ణ, మహిపాల్, జాను, అంజయ్య, వెంకయ్య, సంగమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు వైద్య పరీక్షలు

నారాయణఖేడ్: మున్సిపల్ సమావేశ మందిరంలో శానిటేషన్ కార్మికులకు శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. మున్సిపల్ వంద రోజుల ప్రణాళికలో భాగంగా కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించడమే కాకుండా పట్టణంలోని 12వ వార్డులో తడి, పొడి చెత్త వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్, మేనేజర్ వెంకటశివయ్య, మాజీ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

మండల కార్యవర్గం ఎన్నిక

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): బీజేపీ నూతన మండల కార్యవర్గం శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నికైంది. బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి ఆదేశాల మేరకు నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేసినట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఆదిత్య ఓ ప్రకటనలో తెలిపారు. ప్రధానకార్యదర్శులుగా నామ హరీశ్(కొల్కుర్),భరత్(గొల్లగూడెం), ఉపాధ్యక్షులుగా విఠల్(ఆరూర్), విద్యసాగర్(పొట్టిపల్లి), లక్ష్మి తుల్జయ్య(చందాపూర్), పడమటి స్వప్న శ్రీశైలం(గొల్లగూడెం),కార్యదర్శులుగా కుమార్(ఆరూర్),మోహన్ చారి (నందికంది),ప్రసాద్(ఎల్లారం),శ్రీకాంత్ (వెల్టూర్), కోశాధికారిగా సుభాష్(ఆత్మకూర్)లను ఎన్నుకున్నారు.

ప్రత్యేక పూజలు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): భారతినగర్ డివిజన్ పరిధిలోని పాత ఎంఐజీ కాలనీ రామాలయంలో హన్మాన్ విగ్రహం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం

జిన్నారం (పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీలో పనిచేసే దేవయ్య ఇటీవల మృతి చెందారు. ఆయన మృతితో కుటుంబం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటుందని తెలుసుకున్న బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు ఆనంద్ కృష్ణా రెడ్డి పెద్ద మనసుతో ముందుకు వచ్చి మృతుడి కుమార్తె వివాహానికి శుక్రవారం రూ. 15 వేల ఆర్థిక సహాయం అందజేశారు.

మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరుటౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించింది. ఈ సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో ఐదుగురిని పట్టుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన వాహనదారుల ను శుక్రవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా ఇద్దరికి రూ. వెయ్యి, మరో ముగ్గురికి రూ . 2 వేల చొప్పున జరిమాన విధించినట్లు పేర్కొన్నారు.

సజావుగా భూభారతి సదస్సులు

జిన్నారం(పటాన్‌చెరు): ఉమ్మడి జిన్నారం గుమ్మడిదల మండలాల్లో భూభారతి సదస్సులు సజావుగా కొనసాగుతున్నాయి. శుక్రవారం జిన్నారం మండల గ్రామంలో 49, మాదారంలో 46 దరఖాస్తులను అధికారులకు అందజేసినట్లు తహసీల్దార్ దేవదాస్ పేర్కొన్నారు. గుమ్మడిదలలో 78 అర్జీలు రైతులు అందజేసినట్లు తహసిల్దార్ పరమేశం తెలిపారు. కార్యక్రమంలో ఆయా మండలాల రైతులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

న్యాయమూర్తి మహ్మద్ అసదుల్లా



కోర్టు ఆవరణలో మొక్క నాటుతున్న న్యాయమూర్తి అసదుల్లా

జోగిపేట(అందోల్): పర్యావరణాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని జూనియర్ కోర్టు సివిల్ జడ్జి మహ్మద్ అసదుల్లా అన్నారు. పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం జోగిపేట కోర్టు ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పర్యావరణాన్ని రక్షించుకోవడం వల్ల ఎన్నో ప్రయోజనాలున్నాయని, ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని కోరారు. మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. కార్యక్రమంలో ఏజీపీ షంషీర్ బేగ్, న్యాయవాదులు లింగమయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

దేవాలయాల పరిరక్షణకు ప్రభుత్వం కృషి

- ఆలయకమిటీ ప్రమాణ స్వీకారం
- టీజీఐఐసీ చైర్మన్ నిర్మలారెడ్డి

సదాశివపేట(సంగారెడ్డి): దేవాలయాల పరిక్షణకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తుందని టీజీఐఐసీ చైర్మన్ నిర్మలారెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని లోపలికోట హనుమాన్ మందిరం నూతన అధ్యక్ష కార్యవర్గ సభ్యులు శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నిర్మలారెడ్డి మాట్లాడుతూ పట్టణంలోని దేవాలయాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. లోపలికోట హనుమాన్ మందిరం నూతన అధ్యక్షులు నాగారం శ్రీనివాస్, కమిటీ సభ్యులు పోలని ర్మల, మనోహర్, అశోక్, జయరాం, మనోహర్, బాలరాజు, పోల సంగమేశ్వర్, సీడీసీ చైర్మన్ రాంరెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కంది కృష్ణ, కాంగ్రెస్ పార్టీ పట్టణ మండల అధ్యక్షుడు సత్యనారాయణ, సిద్దన్న, మాజీ కౌన్సిలర్లు నాగరాజు, గుండు రవి, కోవూరి శంకర్‌గౌడ్, లడ్డు, తుకారాం, లోపలికోట వాసులు పాల్గొన్నారు.



లోపలికోట హనుమాన్ మందిరంలో ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గ సభ్యులు

దేవాలయాల నిర్మాణాలతో ఆధ్యాత్మిక శోభ

కాంగ్రెస్ నేత నీలం మధు



విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నేత నీలం మధు

పటాన్‌చెరు టౌన్: దేవాలయాల నిర్మాణంతో ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరుస్తుందని కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్ పేర్కొన్నారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గం అక్కన్నపేట మండల పరిధిలోని చౌటపల్లి గ్రామంలో శుక్రవారం ఏర్పాటు చేసిన పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన, ఆలయ ప్రారంభ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ముదిరాజ్‌ల ఆరాధ్య దైవమైన పెద్దమ్మ తల్లి ఆలయాన్ని నిర్మించుకోవడం సంతోషకరమన్నారు. ఆ పెద్దమ్మ తల్లి ఆశీస్సులతో ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని ప్రార్థించానన్నారు. ఆలయాల అభివృద్ధికి ఎల్లప్పుడూ తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రాజయ్య, కుమార్, రవీందర్, రమేష్, సురేందర్, మల్లేష్, మహేశ్,రంజిత్, శ్రీనివాస్,రవి,శేఖర్,నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



మునిపల్లి(అందోల్): పిల్లలను బడిలో చేర్పిస్తున్న నాయకులు



రాయికోడ్ బడిబాట ర్యాలీలో పాల్గొన్న ఎంఈఓ, హెచ్‌ఎం శ్రీనివాస్

మునిపల్లి(అందోల్): ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని రాయికోడ్ మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ రాంరెడ్డి లబ్ధిదారులను కోరారు. మండలంలోని తాటిపల్లిలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి శుక్రవారం భూమిపూజ నిర్వహించారు. అంతకు ముందు బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఆంగన్ వాడీ కేంద్రంలోని పలువురు విద్యార్థులను బడిలో చేర్పించారు. కార్యక్రమంలో తాటిపల్లి మాజీ సర్పంచ్ అంజిరెడ్డి, ఎంపీడీఓ హరినందన్‌రావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సతీశ్‌కుమార్, సంగమేశ్వర్, రాములు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

వట్‌పల్లి(అందోల్): ప్రభుత్వ పాఠశాల్లో నాణ్యమైన విద్య అందుతుందని, తమ పిల్లలను సర్కారు బడుల్లోనే చేర్పించాలని కోరుతూ మండలంలోని ఆయా గ్రామాలలోల ఉపాధ్యాయులు శుక్రవారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటా తిరుగుతూ ప్రభుత్వం విద్యార్థులకు అందజేస్తున్న ప్రోత్సహకాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఉచిత పాఠ్య పుస్తకాలు, యూనిఫాం, నోట్ పుస్తకాలు, ఉపకార వేతనాలు ఉచితంగా అందించనున్నట్లు తెలిపారు.

సకల సదుపాయాలతో బోధన

రాయికోడ్(అందోల్): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నామని ఎంఈఓ మాణ్యయ్య, హెచ్‌ఎం శ్రీనివాస్ అన్నారు. మండలంలోని రాయికోడ్, సింగితం గ్రామాల్లో శుక్రవారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల ప్రత్యేకతల గురించి వివరించిన బ్యానర్లతో గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఖైరత్ అలీ, ఎంఆర్‌సీ సిబ్బంది, స్థానిక యువకులు పాల్గొన్నారు.

పిల్లలను సర్కారు బడిలో చేర్పించండి

నారాయణఖేడ్: ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని నిజాంపేట్ మండల కేంద్రంలో జిల్లా పరిషత్తు ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు కోరారు. సర్కారు బడిలో ఉచిత పాఠ్య, నోటు పుస్తకాల పంపిణీ, మంచి బోధన, ఉచిత దుస్తులు, మధ్యాహ్న భోజనం తదితర సదుపాయాలు ఉంటాయన్నారు. కార్యదర్శి లక్ష్మణ్, మాజీ సర్పంచ్ జగదీశ్వరాచారి, మాజీ ఉప సర్పంచ్ రాంచందర్ రావు, గంగారెడ్డి, సాయిలు, శ్రీనివాస్, రమేష్, గంగారాం పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి

జిన్నారం(పటాన్‌చెరు): మండలంలోని చెట్ల పోతారం, బొల్లారం, నల్తూరు గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు శుక్రవారం బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ బడుల ప్రాముఖ్యతను వివరిస్తూ పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. పలువురు కొత్త పిల్లలకు పాఠశాలలో ప్రవేశాలు కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

దేవాలయం అభివృద్ధికి విరాళం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పట్టణంలోని కాకతీయనగర్ సీతారామాంజనేయ స్వామి ఆలయంలో శుక్రవారం జరిగిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా మాధవానంద సరస్వతి స్వామి వారిని కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈసందర్భంగా ఆలయ అభివృద్ధికి అలయ కమిటీ సభ్యులకు రూ. 5 లక్షలను విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యులు సుధాకర్‌రెడ్డి, నాయకులు వెంకట్‌రెడ్డి, ఐలేష్, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

సరిహద్దు చెక్‌పోస్టు తనిఖీ

జహీరాబాద్ టౌన్: మండలంలోని చిరాగ్‌పల్లి(మాడ్గి)వద్ద గల రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టును శుక్రవారం ఎస్పీ పరితోష్ పంకజ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన చెక్‌పోస్టు సిబ్బందితో మాట్లాడారు. ప్రతి వాహనాన్ని క్షుణంగా తనిఖీ చేయాలని, గోవుల అక్రమ రవాణా జరగకుండా గట్టి నిఘా పెట్టాలని సూచించారు. అత్యవసర సమయంలో కంట్రోల్‌కు సమాచారం అందించాలని చెప్పారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమయించి పశువులను అక్రమ రవాణాకు పాల్పడితే చట్టరిత్య కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎస్పీ వెంట డీఎస్పీ సైదానాయక్, జహీరాబాద్ టౌన్ సీఐ. శివలింగం, చిరాగ్‌పల్లి ఎస్ఐ రాజేందర్‌రెడ్డిలు ఉన్నారు.

చిరు ధాన్యాలు సాగు చేయండి

నారాయణఖేడ్: భవిష్యత్తులో చిరు ధాన్యాల ఆహార అవసరం, సాగు అధికంగా ఉండనుందని, కావున ప్రతీ రైతు తమ భూముల్లో కొంత మొత్తంలో చిరు ధాన్యాల సాగును చేపట్టాలని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్ రీసెర్చ్ (ఐఐఎంఆర్) ప్రధాన శాస్త్రవేత్త డా.రాజేంద్ర కుమార్, వ్యవసాయ విస్తరణ శాస్త్రవేత్త డా.సాయి ప్రియాంక సూచించారు. నాగల్‌గిద్ద మండలంలోని గురుసింగ్ తండా, మున్యానాయక్ తండా, సేరి శంకర్‌తండా, ఇరక్‌పల్లి గ్రామంలో శుక్రవారం వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జొన్న పంటలో మేలైన జాతుల గూర్చి వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలైన పీఎం కిసాన్, రైతు భరోసా, పీఎం ఫసల్ బీమా యోజన, వ్యవసాయ పరికరాల సబ్సిడీ తదితర అంశాలను వివరించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త డా.స్నేహలత, పశువైద్య శాస్త్రవేత్త డా.కై లాష్, భూసార పరీక్ష నిపుణులు, ఈ.స్వామి, హార్టికల్చర్ అధికారి కె.మానికరెడ్డి, సీడ్ ఎన్‌జీవో సీఈవో చంద్రశేఖర్, ఏఈవో శ్రవంతి పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

క్రైస్తవుల సంక్షేమానికి కృషి

కార్పొరేటర్ మెట్టు కుమార్

పటాన్‌చెరు టౌన్: క్రైస్తవుల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని కార్పొరేటర్ మెట్టు కుమార్ పేర్కొన్నారు. తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని పాటీ చౌరస్తా వద్ద మరనాత హీలింగ్ టెంపుల్ చర్చికు సొంత నిధులతో నిర్మించిన భోజనశాలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. చర్చిలో ప్రతీ ఆదివారం వేల మంది ప్రార్థనలు నిర్వహించేందుకు వస్తారని, వారికోసం భోజనాలు పెట్టడానికి వంటశాలను రూ.5 లక్షల సొంత నిధులతో నిర్మించినట్లు తెలిపారు.

అంబేడ్కర్ జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలి

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



స్వాగత తోరణాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు : రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ ఆలోచనలు, ఆశయాల సాధనకు ప్రతీ ఒక్కరు కంకణబద్దులు కావాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పేర్కొన్నారు. యువత అంబేడ్కర్ జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు. పటాన్‌చెరు మండలం రామేశ్వరం బండ గ్రామ పరిధిలోని వీకర్ సెక్షన్ కాలనీలో గ్రామ మాజీ సర్పంచ్ అంతిరెడ్డి సొంత నిధులతో ఏర్పాటు చేసిన డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ కాంస్య విగ్రహాన్ని శుక్రవారం సాయంత్రం ఎమ్మెల్యే ఆవిష్కరించారు. అంతకుముందు అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని పటేల్‌గూడ గ్రామంలో మాజీ ఎంపీపీ దేవానంద్ సొంత నిధులతో నిర్మించిన శ్రీశ్రీశ్రీ దుర్గామాత దేవాలయం స్వాగత తోరణాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో పటేల్‌గూడ గ్రామంలో నిర్వహించిన వన మహోత్సవం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తన జీవితాన్ని బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి అంకితం చేసిన మహనీయుడు అంబేడ్కర్ అని తెలిపారు. ఆయన స్ఫూర్తిని భవిష్యత్తు తరాలకు అందించాలన్న లక్ష్యంతో నియోజకవర్గ వ్యాప్తంగా ఆయన విగ్రహాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. నూతన దేవాలయాల నిర్మాణాలకు..అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తున్నామన్నారు. దేవాలయాలు మానసిక ప్రశాంతతకు నిలయాలని ప్రతి ఒక్కరూ దైవ భక్తిని పెంపొందించుకోవాలని కోరారు.